ఊహాలోకంలోకి తీసుకెళ్ళిన ఆ శిల్ప సౌందర్యమేమిటి?

## కె.ఆర్.కె.మోహన్ కథ

# ప్రాణం వచ్చిన ప్రతిమ

శేఖర్ చక్కని చిత్రకారుడు. అందమైన బొమ్మల్ని ఎందరో గీయగలరు. కాని శేఖర్ గీసిన చిత్రాలు చూస్తుంటే సజీవ వ్యక్తుల సన్నిధిలో ఉన్న అనుభూతి కలుగుతుంది. ఆ ఊరిలో స్థానిక ప్రముఖులు చిత్రశాల ఒకదానిని నిర్మించతలపెట్టారు. అందులో ఒక ప్రత్యేక విభాగంలో బౌద్ధ చిత్రకళనుతెలిపే చిత్రాల ప్రతి రూపాలను నెలకొల్పాలని వారి సంకల్పం. ప్రముఖ చిత్రకారుడైన శేఖర్‌కి ఆ బాధ్యతలను అప్పగించారు వారు. స్వతహాగా బౌద్ధ చిత్రకళపట్ల ప్రత్యేక అభినివేశంగల శేఖర్ అందుకు మహదానందంగా ఒప్పుకున్నాడు.

అమరావతి, నాగార్జునకొండవంటి ఆంధ్రదేశంలోని బౌద్ధ క్షేత్రాలను దర్శించుకుని, బౌద్ధ చిత్రకళ, శిల్పకళలకు కాణాచి, వాటి ఉన్నత శిఖరాలకు దర్పణం అనదగ్గ అజంతా చేరుకున్నాడు శేఖర్.

ఆ గుహ మధ్య ధ్యానముద్రలోవున్న బుద్ధభగవానుని నిలువెత్తు విగ్రహం ఉంది. దానికి అటూ యిటూ చిన్న చిన్న శిల్పాలున్నాయి. గైడ్ ఆ బుద్ధ భగవానుని విగ్రహం మీద ఫ్లడ్‌లైట్‌ను ఫోకస్ చేశాడు.

"అయితే... అమ్మా... జాగ్రత్తగా చూడండి. ఈ విగ్రహ శిల్పంలో ఒక విశేషం ఉంది. ఇప్పుడు చూడండి. మీకు ధ్యానముద్రలోనున్న బుద్ధ భగవానుడు కనిపిస్తాడు. అవునా?" అంటూ సందర్శకుల ముఖాలవైపు చూశాడు.

బుద్ధ భగవానుని ముఖంలో అనిర్వచనీయమైన ప్రశాంతత, అలౌకికమైన ఆనందం గోచరిస్తున్నాయి. ధ్యానముద్రలోనున్న భగ



వానుని చూస్తూనే అప్రయత్నంగా చేతులెత్తి నమస్కరించాడు శేఖర్.

అటు తర్వాత గైడ్ విగ్రహానికి ఎడమవైపుగా వెళ్ళాడు.

''జెంటిల్‌మన్. ఇటురండి. ఇక్కడనుంచి భగవానుని విగ్రహాన్ని బాగా గమనించండి'' అంటూ విగ్రహం ముఖంపై అటువైపు నుంచి ఫోకస్ చేశాడు గైడ్.

విచిత్రం?! భగవానుని ముఖంలో ఏదో దిగులు, ఏమిటో ఆలోచిస్తున్న భావం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

"బుద్ధ భగవానుడు ప్రజల కష్టాలకు కరిగిపోయి దీనంగా ఉన్నాడు. చూశారా?" అన్నాడు గైడ్.

శేఖర్‌కి కలిగిన మనోభావాలను అతని మాటలు ధృవపరిచాయి.

ఈసారి కుడివైపుకు వచ్చాడు గైడ్.

"ఫ్రెండ్స్... ఈసారి ఈ కుడివైపునుంచి చూడండి. శిల్పి చాతుర్యం ఎంత గొప్పదో గమనించండి" అంటూ ఆవైపునుంచి లైట్‌ను ఫోకస్ చేశాడు.

మహా విచిత్రం! అటువైపునుంచి చూస్తే భగవానుడు చిద్విలాసంగా చిరునవ్వు నవ్వుతూ, భావాతీతమైన కరుణా దృక్కుల తో చూస్తున్నట్లుగా ఉంది.

"చూడండి. ప్రజలకు మార్గం చూపించగల దివ్య జ్ఞానాన్ని పొంది ఆనందంతో భగవానుడు ఎంత ప్రసన్నంగా, చిద్విలాసంగా ఉన్నాడో!" అంటూ శిల్ప చాతుర్యం గురించి వివరిస్తూ అన్నాడు గైడ్.

ఆ అజ్ఞాత శిల్పి శిల్ప విజ్ఞానానికి అచ్చెరువొందుతూ ఆ బొమ్మ ముందు సజీవశిల్పాలలాగా, ఆ రాతి బొమ్మలమధ్య ప్రాణం ఉన్న బొమ్మలలాగా నిలబడిపోయారు సందర్శకులు.

"ఇటురండి. ఈ కుడ్య చిత్రాలలోని విశేషాలు చూద్దురుగాని" అంటూ ముందుకు సాగాడు గైడ్, చేతిలో ఎలక్ట్రిక్ లైట్ ఉంచుకునే.

మౌనంగా అతన్ని అనుసరించారు సందర్శకులు.

ఆ గోడమీద అద్భుతమైన వర్ణ సమ్మేళనంతో, బుద్ధుని జీవితంలోని కొన్ని ప్రధాన ఘట్టాలు ఒక క్రమంలో చిత్రించబడి ఉన్నాయి. ఫ్లడ్‌లైట్ కాంతిలో అవి అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఎక్కువ కాంతి వేయందే ఏమీ కనిపించని ఆ చీకటి గుహలో ఆ అద్భుత శిల్పాలను ఎలా చెక్కారా, అచ్చెరువుగొల్పే ఆ చిత్తరువులను ఎలాగ గీశారా అని ఆశ్చర్యపోతూవాటివంక చూడసాగాడు శేఖర్.

ఒకచోట ఐదు చిత్రాలు ఒక క్రమంలో చిత్రించబడి ఉన్నాయి. మొదటి ఫలకంలో ఒక గున్న ఏనుగు వయసుమీరిన తల్లి ఏనుగుకు తండ్రి ఏనుగుకు సపర్యలు చేస్తోంది. కొంచెం దూరంలో వేటకు వచ్చిన ఒకరాజు, అతని పరివారం కనిపిస్తున్నారు.

రెండవ ఫలకంలో సైనికులు ఆ గున్న ఏనుగుని బంధించి రాజధానికి తీసుకుపోతున్నారు.

మూడవ ఫలకంలో తల్లిదండ్రులకు దూరమైన దిగులుతో ఆహారాన్ని ముట్టకుండా మొరాయిస్తున్న ఏనుగు, అహింసామార్గాన్ని బోధిస్తున్న బుద్ధభగవానుడు చిత్రించబడివున్నాయి.

గౌతమ బుద్ధుని బోధనలవల్ల ప్రభావితుడైన రాజు, ఆ గున్నను తిరిగి అడవికి పంపించివేయడం దానిని తల్లి ఏనుగు, తండ్రి ఏనుగు ఆప్యాయంగా స్వాగతిస్తూండడం గీయబడివున్నాయి. నాలుగవ చిత్రంలో ప్రసన్న మాగమం మూలంగా అవ్యాజ్యానందాన్ని అనుభవిస్తున్న భావం, ఆనంద భాష్పాలతో

ఆ మూడింట కన్నులు చెమ్మగిల్లడం అత్యద్భుతంగా రచించాడు చిత్రకారుడు.

ఐదవ చిత్రంలో బుద్ధుడు ముందుకి సాగుతుంటే, స్త్రీ పురుష వివక్ష లేకుండా అశేషజనవాహిని ఆయనను అనుసరిస్తుండడం చిత్రించబడి ఉంది.

ఆ చిత్రాలవంక పరిశీలనగా చూడసాగాడు శేఖర్. ఐదవ చిత్రంలోని ఒక అత్యంత సుందరమైన స్త్రీ మూర్తి అతని దృష్టిని ఆకర్షించింది. ఆమె ఒక రాజకుమారిలాగా ఉంది. రాజభవనంలోని ఒక స్థంభానికి అనుకుని ఒక కాలు వెనక్కి మడిచి, ఆ జనంలో ఎవరి వంకనో విచారంగా చూస్తోంది. ఆమె ముఖంలో వ్యక్తం అవుతున్న దిగులు, ఆవేదన సజీవంగా చిత్రీకరించబడి ఉన్నాయి.

ఆమె ఎవరో... ఏమో! ఆమె అనుభవిస్తున్నఆవేదనను చూస్తుంటే హృదయంలో చేయిపెట్టి కెలికినట్లయింది శేఖర్‌కి. ఎవరో గుండెల్ని పిండి చేస్తున్నట్లనిపించింది.

ఆ ఐదు చిత్రాలలోని విశేషాలు చెప్తూ గైడ్ కేవలం ఏనుగుగున్న కథ చెప్పి 'అహింసామార్గంలో ప్రజలు బుద్ధుని అనుసరించారు' అంటూ ముక్తసరిగా ముగించి మరో బ్యాచ్‌కి చెప్పడానికి వెళ్ళిపోయాడు. ఆ స్త్రీ మూర్తిని గురించి అడగాలని అనుకున్నాడేకాని శేఖర్‌కి ఆ అవకాశం లేకపోయింది. నిజానికి ఆమె ఎవరో, ఆమె కథ ఏమిటో అతనికి కూడా తెలిసి ఉండకపోవచ్చు. "ముఖ్యమైన విశేషమేమైనా ఉంటే అతను చెప్పి ఉండకపోతాడా!" తనంటూ ఆ గుహనుంచి బయటకు వచ్చాడు శేఖర్. ఆ స్త్రీ మూర్తిని గురించిన ఆలోచనలే అతనిని వెంటాడసాగాయి. అతని మనస్సులో మెదలుతున్నది. చిత్రకారుని చాతుర్యంకాదు. జీవకళ ఉట్టిపడుతున్న ఆ స్త్రీ మూర్తి చెప్పుకోలేని ఆవేదనతో అక్కడ నిలబడ్డట్లనిపిస్తోంది. ఆమె దిగులు ఏమిటో కాని శేఖర్ సున్నిత హృదయాన్ని కలచివేసింది. ఇంక ఇతర విశేషాలేవీ చూడాలని అనిపించలేదు. ఆమెని గురించే ఆలోచిస్తూ గుహ బయట ఒక బండమీద కూర్చుండిపోయాడు. కళ్ళు మూసుకుని నుదురునులుముకుంటూ దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

ఘల్లుఘల్లున కింకిణీస్వరాలు వినిపిస్తున్నా



### హైజాక్

విమానాన్ని హైజాక్ చేసారు.

"మర్యాదగా విమానాన్ని వెనక్కి పోనివ్వు" బెదిరించారు హైజాకర్లు పైలెట్‌ని.

"అరే! మీరు పోయిన స్టేజీలో దిగడం మర్చిపోయారా?" పకపక నవ్వుతూ అడిగాడు కొత్త పైలెట్.

—రమణి శ్రీనివాస్ (వినుకొండ)

యి. ఆ శబ్దం అంతకంతకు దగ్గర కాసాగింది

ఆలోచనలను ఆపి అటువైపు చూశాడు శేఖర్.

ఆశ్చర్యం!

ఎవరిని గురించి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నాడో ఆ స్త్రీ మూర్తి, అతనివైపే నడిచివస్తోంది.

నిశ్చేష్టుడై ఆమెవంకే చూడసాగాడు శేఖర్.

ఆమె నెమ్మదిగా వచ్చి శేఖర్ ముందు నిలబడింది. కొంచెం తేరుకుని "మీరు... మీరు ఎవరు?" అని తడబడుతూ అడిగాడు శేఖర్.

"ఆ... నేనే..." అంది ఆమె.

"ఆ చిత్రంలో..."

"... ఉన్నది నేనే."

"అదెలా సాధ్యం? బొమ్మకి ప్రాణం వస్తుందా?"

"ఏం ఎందుకు రాకూడదు? ఒక చిత్రకారుడు తన మనసంతా నిలిపి నా చిత్రాన్ని రచించి అందులో జీవకళ నింపాడు. మరొక చిత్రకారుడు సర్వాన్నీ మరిచి నా గురించే ఆలోచిస్తూ తన మనసుతో నన్నిక్కడకు లాక్కువిచ్చాడు." అంది ఆమె చిరునవ్వు నవ్వుతూ. అయితే ఆ చిరునవ్వు ఆమె ముఖంలో అలముకొన్న దిగులును మాత్రం దూరం చేయలేకపోయింది.

ఏమి అనాలో అర్థంకాక "నువ్వెవరు?" అని నువ్వు అన్నందుకే నాలుక కరుచుకొని "మీరెవరు?" అన్నాడు శేఖర్.

"పర్వాలేదు" ఆత్మీయులైన మీరు నన్ను "నువ్వు" అనొచ్చు. అలా అంటేనే నాకు తృప్తిగా ఉంటుంది" అంది ఆమె.

"సరే" మీరెవరో, మీకథ ఏమిటో చెప్తారా?" అన్నాడు శేఖర్ మళ్ళీ మీరంటూ

ఆమె నిర్లిప్తంగా నవ్వి "చెప్తాను. శతాబ్దాల నుంచీ, సహస్రాబ్దాలనుంచీ గుండెలో గూడుకట్టుకుని ఉన్న ఈ దిగులును ఆత్మీయులతో కాక ఇంకెవరితో చెప్పుకుంటాను?

—ఇది వేల సంవత్సరాలనాటి మాట. ఆంధ్రదేశంలోని దక్షిణ చాళుక్యుల రాకుమారిని నేను. నాపేరు మణిమేఖల. నా తండ్రి విజయాదిత్యుడు. ఎంతో కీర్తి ప్రతిష్ఠలు గడించిన వంశం మాది. మా నాన్నగారి పేరు ప్రఖ్యాతులు తెలిసి, మా రాజ్యంగుండా వెళ్ళే రాజులు, రాకుమారులు ఆయన దర్శనం చేసుకొని సత్కారాలు పొంది మరీ వెళ్ళేవారు.

ఒకరోజున ఉత్తరదేశంనుంచి మగధ రాజకుమారుడు విక్రముడు దేశాటనం చేస్తూ మా రాజ్యానికి వచ్చాడు. మందీ మార్బలంతో అట్టహాసంగా వస్తున్న అతనిని రాజభవనం పై అంతస్థులోని గవాక్షంలో నిలబడి చూశాను. శ్వేతాశ్వంపై మధ్యందిన మార్తాండునిలా వెలిగిపోతూ ఉన్నాడతను. అతనివంక నేను చూసిన సమయానికే అతనూ నా వంక చూశాడు. మా ఇద్దరి చూపులూ కలిశాయి. మొదటి చూపులోనే అతనికి నా మనసుని అర్పించేశాను. అతనికి కూడా నాపై మనసు కలిగిన విషయం తెలుసుకుని మా తండ్రిగారు కూడా ఎంతో

సంతోషించారు. ఆ తర్వాత పెద్దలు సంప్రదించుకుని మా వివాహం ఖాయపరిచారు. వారి ఆచారం ప్రకారం, ఆడ పెళ్ళివారమై నా మేమందరం మగధరాజ్యానికి తరలివెళ్ళాం.

మాకు విడిదిగా చక్కని రాజభవనాన్ని ఇచ్చారు. సకల సౌకర్యాలూ కల్పించి సమస్త మర్యాదలూ చేశారు.

పెళ్ళికి ఇంక మూడురోజులే వ్యవధి ఉంది. ఊరంతా రంగరంగ వైభోగంగా అలంకరించారు. ఇంతలో బుద్ధభగవానుడు ప్రజలను ప్రబోధిస్తూ ఆ నగరానికి వస్తున్న వార్త తెలిసింది. మా వివాహ సమయంలో ఆ భగవత్ స్వరూపుడు వస్తున్నందున అందరం ఎంతో ఆనందించాం. ఆ మహామనీషి ఆశీస్సులతో మా దాంపత్యం పది కాలాలు పచ్చగా ఉంటుందని ఆశించాం.

అయితే వరం అవుతుందనుకున్న ఆ మహామనీషిరాకే నాకు శాపం అవు తుంద నుకోలేదు. మర్నాడు వివాహం అనగా భగవానుడు నగర ప్రవేశం చేశాడు. ఆయన లో ఏమి ఆకర్షణ ఉందో ఏమో నగరం నగరం ఆయన వెంట కదిలింది. వీధిలో కలకలం విని గవాక్షంలో నిలబడి చూడసాగా ను. భగవానుడు ముందు నడుస్తుంటే "సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి అంటూ జనం ప్రవాహంలాగా వెనక వెళ్ళసాగారు.

జనం మధ్యలోనున్న ఒక వ్యక్తిని చూసి నేను కొయ్యబారిపోయాను. అతడెవరో కాదు. ముండనం చేయించుకొని కాషాయాంబరాలు ధరించి సన్యాసం స్వీకరించి, స్వామివెంట వెళ్ళిపోతున్న విక్రముడు.

ఆ దృశ్యం చూసి నానోట మాట రాలేదు. అతడూ నావంక చూశాడు. రెండు చేతులు ఎత్తి నాకే నమస్కరించి, సెలవు తీసుకుంటున్నట్లుగా సాగిపోయాడు. ప్రాపంచిక బంధాలు తెంచుకొని తాను వెళ్ళిపోయిన నాకు మాత్రం శాశ్వతంగా విషాదమే మిగిలిపోయింది. అప్పటినుంచి దిగులుతో, అతడు వెళ్ళినవంకే చూస్తూ ఇలా శిలగా మారి నిలిచిపోయాను" అంటూ తన కథను ముగించింది మణిమేఖల.

"అరె... ఎంతటి విషాదగాథ! మరి ఎన్నాళ్ళీ తపస్సు?" అన్నాడు శేఖర్.

"నేను... పొరపాటు చేశాను. వారిని



## పరమాణువు

మనకు కన్పించే పదార్థాలన్నిటికీ మూలమయిన పరమాణువు చాలాకాలం విభజించలేనిదిగా పరిగణింపబడింది. కానీ తర్వాత దీన్ని విభజించవచ్చుని, అది ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లతో నిర్మితమయిందని తెలిసింది.
పరమాణువు వ్యాసం ఒక సెంటీమీటరును పదికోట్ల భాగాలు చేస్తే అందులో నాలుగు భాగాలంత మాత్రమే ఉంటుంది.

మధ్యాహ్నపు శీలానంద్

అనుసరించి నేను కూడా సన్యాసిని కావలసిం ది. ప్రజల దైన్యం చూసి చలించిపోయే భగవానుడు నా ఆవేదనను చూసి తానూ దిగులుపడుతున్నాడు. ఏమో దైన్యదృక్కులు ప్రసరిస్తున్నాడు. ఆయన చిరునవ్వుతో ప్రస న్న దృక్కులతో నన్నొక్కసారి కరుణిస్తే చాలు. ఈ భవబంధాలు తెంచుకుని నేనూ వారు ఎక్కడవున్నా వెళ్ళివారి శిష్యురాలిని అవుతాను'' అంది ఆమె.

''భగవానుడు ఎప్పుడూ కరుణామయుడే. నా వెంటరా. ఆయన ప్రసన్న దృశ్యాలను నీకు చూపిస్తాను'' అంటూ లేచి గుహలోని బుద్ధవిగ్రహంవైపు నడవసాగాడు శేఖర్.

ఆమె శేఖర్ని అనుసరించింది.

విగ్రహం కుడివైపునకు రాగానే ''స్వామి ని చూడు. ఎంత ప్రసన్నంగా ఉన్నాడు?'' అంటూ చూపించాడు శేఖర్.

''నిజం... స్వామి నన్ను కరుణించాడు. ఈ నాటితో నా కర్మ పరిపక్వం అయింది'' అంటూ భగవానుని ముందు మోకరిల్లింది. మణిమేఖల.

"సార్... అందరూ తిరిగి వెళ్ళిపోతున్నా రు. ఇంకా ఇక్కడే ఉన్నారేమిటి?'' అంటూ గైడ్ భుజంతట్టి లేపేసరికి ఈ లోకంలోకి వచ్చాడు శేఖర్.

''పదండి. బస్ బయలుదేరే టైం అయింది'' అంటూ ముందుకు నడిచాడు గైడ్.

''ఇప్పుడే వస్తున్నాను'' అంటూ చకచ కా గుహలోకి వెళ్ళాడు శేఖర్.

సిగరెట్ లైటర్ వెలిగించి చిత్రంవంక చూశాడు శేఖర్.

ఆశ్చర్యం! ఈసారి మణిమేఖల ముఖం లో దైన్యంలేదు.

అనిర్వచనీయమైన తృప్తి కనిపిస్తుంది.

బుద్ధభగవానుని విగ్రహం వైపు చూశా డు.

స్వామి ముఖంలో దిగులు లేదు.

తాను కాంచింది కలో, చూస్తున్నది భ్రమో తెలియక నుంచుండిపోయాడు. ఆ చిత్రం, ఆ శిల్పం చూసి తన మనసే ఆ కథను అల్లుకోలేదుకదా అని ఆశ్చర్యపోయా డు శేఖర్.

క్రింద బస్ హారన్ వినిపించేసరికి చివరిసారిగా మణిమేఖల చిత్రంవైపు చూసి భారంగా బయటికి వెళ్ళాడు శేఖర్.

*

